## • దేవాదుల రిజర్వాయర్ వద్ద రైతుల నిరసన



సాగు నీరు లేక పంటలు ఎండుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని జనగామ జిల్లా నర్మెట మండలం వెల్దండ రైతులు ఆందోళన వ్యక్తంచేశారు. వెల్దండలోని దేవాదుల రిజర్వాయర్ తూముకు నీళ్లు అందకపోవడంతో కాల్వను తీసేందుకు శనివారం రైతులు జేసీబీ సాయంతో వెళ్లారు. ఈ క్రమంలో అధికారులు ఫోన్లు చేసి నీటిని తరలిస్తే కేసులు పెడుతామని హెచ్చరించడంతో రిజర్వాయర్ వద్ద నిరసన తెలిపారు. అధికారుల తీరుపై మండిపడ్డారు. – నర్మెట



జోగుళాంబ గద్వాల జిల్లా సింధనూర్‌లోని గ్రామీణ బ్యాంకు ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు, బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య

# రైతులందరికీ రుణమాఫీ చేయాలి

## సింధనూర్‌లోని గ్రామీణ బ్యాంక్ ఎదుట రైతుల నిరసన

అయిజ, మార్చి 29 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రూ.2 లక్షల వరకు రుణమాఫీ అందరికి చేయాలని పలువురు రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం వారు జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం సింధనూరులోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఎదుట వరంగల్ డిక్లరేషన్ పత్రాలను ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. రూ.2 లక్షల రుణమాఫీ వెంటనే చేయాలని డిమాండ్ చేశారు. సింధనూర్ బ్యాంకులో దాదాపు 2,800 మంది రైతులు రుణాలు తీసుకోగా.. కేవలం 2,100 మందికి రూ.15.50 కోట్లు మాఫీ కాగా మరో 700 మందికి మాఫీ వర్తించలేదని అన్నారు. ఎన్నికల సమయంలో షరతుల్లేకుండా రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే మెలికలు పెడుతున్నదని ధ్వజమెత్తారు. మాఫీ అయ్యిందా? అంటూ తాము రోజూ బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. రైతుల ఆందోళనకు బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య మద్దతు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను పట్టించుకోవడం మానేసి.. తన పదవిని కాపాడుకునేందుకు ఢిల్లీకి మూటలు మోస్తున్నాడని ఆయన విమర్శించారు.

## • ట్యాంకర్ నీటితోనే తడులు



సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం కాశేగుడిసెల గ్రామానికి చెందిన షేక్ కమల్ తనకున్న రెండెకరాల వరిపొలం ఎండిపోతుండటంతో ట్యాంకర్ ద్వారా నీటిని అందిస్తున్నాడు. పంట చేతికి వచ్చే దశలో ఉన్నందున్న ఒక్కో ట్యాంకర్‌కు రూ.1500 చెల్లించి రోజువారీగా నాలుగు ట్యాంకర్లు తెచ్చి పొలం పారించుకుంటున్నాడు. గతంలో ఇలాంటి పరిస్థితిని చూడలేదని రైతు కమల్ ఆవేదన వ్యక్తం చేశాడు. – చేర్యాల

## • ఎంత తవ్వినా బావిలో నీటి జాడేది?



హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూరు తానికుంట పక్కన ఉన్న వ్యవసాయ బావుల్లో నీటి ఊట కన్పించడం లేదు. రైతు దొంగల మొగిళి కూలీలను పెట్టి క్రేన్ సహాయంతో తన వ్యవసాయబావిని తవ్విస్తున్నాడు. ఇంతకు ముందు 10 కోలల వరకు లోతు ఉండగా మరో నాలుగు కోలలు తవ్వినా ప్రయోజనంలేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేస్తున్నాడు. – భీమదేవరపల్లి

## • జగిత్యాలలో రోడ్డెక్కిన మామిడి రైతులు



జగిత్యాల జిల్లా కేంద్రంలోని చల్‌గల్ మామిడి మార్కెట్ వద్ద రైతులు రోడ్డెక్కారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి తక్కువ ధరకు మామిడి కాయలను కొనుగోలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేస్తూ శుక్రవారం అర్ధరాత్రి జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. దీంతో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. చివరికి కిలో మామిడికి రూ.64 చెల్లిస్తామని వ్యాపారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.– జగిత్యాల టౌన్

## • పంట పాయే.. కన్నీరే మిగిలే



నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలంలో సాగునీటి ఇక్కట్లు తీవ్రమయ్యాయి. దుబ్బాక గ్రామానికి చెందిన రైతు శ్రీకాంత్‌రెడ్డి ఐదెకరాల్లో వరి వేశాడు. భూగర్భ జలాలు అడుగంటడం, బోర్లు ఆగి ఆగిపోయడంతో ఇటీవల సగం ఎండిపోయింది. మిగిలిన సగమైనా చేతికొస్తుందనుకున్న రైతు ఆశలు అడియాసలయ్యాయి. బోర్ల నుంచి చుక్కనీరు రాకపోవడం మొత్తం పంట ఎండిపోయింది. ఆదాయం రాకపోవడమే గాక సాగు ఖర్చులు మీద పడ్డాయని శ్రీకాంత్‌రెడ్డి కన్నీటి పర్యంతమయ్యాడు. – ధర్పల్లి

## • ఆదివాసీలకు మంచినీటి కష్టాలు



ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని గిన్నేరా గ్రామ పంచాయతీ పరిధిలో గల తోయగూడ గ్రామానికి చెందిన ఆదివాసీలు బిందెడు నీటి కోసం కిలోమీటర్ల దూరం నడవాల్సి వస్తున్నది. ఎండల తీవ్రతకు తోయగూడ గ్రామంలోని చేతిపంపులు, కొలాంగూడకు చెందిన బోరు అడుగంటిపోయాయి. ఉదయం, సాయంత్రం చుట్టుపక్కల గ్రామాల నుంచి నీటిని తీసుకొచ్చుకుంటున్నారు. అధికారులు స్పందించి మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని తోయగూడ వాసులు కోరుతున్నారు. –ఇంద్రవెల్లి



## ఆస్తిపన్ను ఆదాయం రూ. 1,010 కోట్లు

హైదరాబాద్, మార్చి 29 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఆస్తిపన్ను ఆదాయం వెయ్యి కోట్లు దాటింది. శనివారం వరకు రూ.1,010 కోట్ల ఆస్తిపన్ను వసూలైనట్టు పురపాలకశాఖ శనివారం ఒక ప్రకటనలో వెల్లడించింది. రాష్ట్రంలోని పురపాలక, నగరపాలక సంస్థలు అన్ని కలిపి 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఆస్తిపన్నుల వసూళ్లలో రూ.వెయ్యి కోట్ల మైలురాయిని అధిగమించినట్టు అధికారులు తెలిపారు. 2023–24లో రూ.922 కోట్లు వసూలయ్యాయని పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం (మార్చి 31) ముగియడానికి రెండురోజులే గడువు ఉండటంతో ప్రజలు ఆస్తిపన్ను బకాయిలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. పాత బకాయిల అపరాధ రుసుంపై వన్‌టైమ్ సెటిల్‌మెంట్ స్కీమ్ (వోటీఎస్)ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాగా, జీహెచ్‌ఎంసీ పరిధిలోనే ఆస్తిపన్ను బకాయిలు రూ.7వేల కోట్ల వరకు ఉన్నట్టు సమాచారం.

## ‘పీఈఎల్’ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కేవీ ఘన విజయం

**ఎమ్మెల్యే బీర్ల ఒత్తిళ్లను ఎదుర్కొని 30 ఓట్ల మెజారిటీతో గెలుపు**

యాదగిరిగుట్ట, మార్చి 29 : యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం పెద్దకందుకూరు ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీ లిమిటెడ్ గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కేవీ ఘన విజయం సాధించింది. అధికార పార్టీకి చెందిన స్థానిక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కార్మికులను ఒత్తిడికి గురిచేసినా కార్మికులంతా బీఆర్‌ఎస్‌కేవీకే పట్టం కట్టారు. శనివారం జరిగిన ఎన్నికల్లో 30 ఓట్ల మెజారిటీలో బీఆర్‌ఎస్‌కేవీ ఘన విజయం సాధించింది. మొత్తం 390 ఓట్లకుగానూ బీఆర్‌ఎస్‌కేవీకి 209 మంది కార్మికులు ఓటు చేశారు. సీఐటీయూకి 179 ఓట్లు వచ్చాయి. బీఆర్‌ఎస్‌కేవీ పీఈఎల్ విభాగం అధ్యక్షుడు గొంగిడి మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో విజయోత్సవాలు ఘనంగా జరిగాయి.





## కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో భారీగా చేరికలు

**గులాబీ కండువాలు కప్పిన మాజీ మంత్రి ఎర్రబెల్లి, ఎమ్మెల్యే పల్లా**

420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజల సమస్యలను పట్టించుకోకపోవడంతో విసుగుచెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శనివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. వరంగల్ జిల్లా రాయపర్తికి చెందిన 20 మంది కార్యకర్తలు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. జనగామ జిల్లా తరిగొప్పుల మండలం జాల్‌బాయ్‌తండాకు చెందిన కాంగ్రెస్ నాయకులు జనగామలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సమక్షంలో పెద్ద ఎత్తున బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే పల్లా గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. – రాయపర్తి/తరిగొప్పుల

## కాంగ్రెస్ పాలనలో జర్నలిస్టులపై అక్రమ కేసులు: ఎర్రబెల్లి



మహబూబాబాద్ రూరల్, మార్చి 29 : కాంగ్రెస్ పాలనలో జర్నలిస్టులపై అక్రమ కేసులు పెడుతున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండల నమస్తే తెలంగాణ విలేకరి కొండా సతీశ్‌పై అక్రమ కేసులు నమోదు చేసి మానుకోటలోని సబ్ జైలుకు తరలించారు. ఈ నేపథ్యంలో శనివారం బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి దయాకర్‌రావు సబ్‌జైలులో జర్నలిస్టు సతీశ్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాన్ని నిర్భయంగా పత్రికల్లో రాసే రిపోర్టర్లపై కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు చ ర్యలకు పాల్పడుతూ కేసులు నమోదు చేస్తున్నదన్నారు. ఇటీవల పెద్దవంగర పోలీస్ స్టేషన్‌లో బయట వ్యక్తులతో పోలీసులు కలిసి మందు పార్టీ చేసుకున్నారని, దీనిపై సతీశ్ వెలుగులోకి తేగా.. డీజీపీ స్పందించి ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేశారని తెలిపారు. ప్రజలు, జర్నలిస్టులు ఐక్యంగా నిలిచి ఇలాంటి కేసులను వ్యతిరేకించాలని కోరారు. జర్నలిస్టు సతీశ్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## రాష్ట్రంలో భానుడి భగభగ

హైదరాబాద్, మార్చి 29 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో శనివారం అత్యధికంగా కుమ్రంభీం జిల్లా ధనోరా మండలం కెరమెరిలో 41.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్టు వాతావరణశాఖ పేర్కొంది. రానున్న రెండురోజులు ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయని, ప్రజలు జాగ్రత్త వహించాలని సూచించింది.

# సిరిసిల్లలో కొనుగోలు కేంద్రాలను కొనసాగించాలి

- **ప్రభుత్వం, అధికార యంత్రాంగం పునరాలోచించాలి**
- **ముక్తకంఠంతో చెప్పిన సింగిల్ విండో డైరెక్టర్లు, సభ్యులు, రైతులు**

సిరిసిల్ల రూరల్, మార్చి 29: సిరిసిల్లలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను యథావిధిగా కొనసాగించాలని, సొసైటీల మనుగడను దెబ్బతీయవద్దని సిరిసిల్ల సింగిల్‌విండో డైరెక్టర్లు, సభ్యులు, రైతులు ముక్తకంఠంతో పేర్కొన్నారు. శనివారం సిరిసిల్ల పద్మనాయక ఫంక్షన్ హాలులో సిరిసిల్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజన సభ.. చైర్మన్ బండి దేవదాస్‌గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా దేవదాస్‌గౌడ్ మాట్లాడారు. కేవలం సిరిసిల్ల నియోజకవర్గంలోని సింగిల్‌విండో కొనుగోలు కేంద్రాలు నిలిపివేయడం సరైంది కాదని చెప్పారు. ఈ విషయంపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. కొనుగోలు కేంద్రాలను నిలిపివేస్తే సొసైటీల మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని చెప్పారు. మహిళా సంఘాలకు సగం, సొసైటీలకు సగం సర్దుబాటు చేసి కొనుగోలు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం స్పందించి కొనుగోలు కేంద్రాలు యథావిధిగా నిర్వహించేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా మహాజనసభలో ఎజెండా అంశాలు, బడ్జెట్‌కు ఆమోదం తెలిపారు. కొనుగోలు కేంద్రాలు యథావిధిగా నిర్వహించాలని తీర్మానం చేశారు.



సీత్యాతండాలోని రైతు భూక్యా బిచ్యా భూమిలో బోర్డు పెట్టిన డీసీసీబీ అధికారులు

# అప్పు చెల్లించలేదని భూమి స్వాధీనం

**గిరిజన రైతు భూమిలో డీసీసీబీ జెండా**

దేవరుప్పుల, మార్చి 29 : బ్యాంకులో తీసుకున్న రుణం చెల్లించలేదనే కారణంతో గిరిజన రైతు భూమిని డీసీసీబీ స్వాధీనం చేసుకున్న వైనం జనగామ జిల్లా దేవరుప్పుల మండలం ధర్మాపురం శివారు సీత్యాతండాలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. సీత్యాతండాకు చెందిన భూక్యా బిచ్యా తనకున్న నాలుగు ఎకరాల భూమిని జిల్లా సహకారం కేంద్ర బ్యాంకు(డీసీసీబీ)లో 2021లో తనఖా పెట్టి రూ. 9,81,400 రుణం తీసుకున్నాడు. వాయిదాల ప్రకారం డబ్బు చెల్లించకపోవడంతో శనివారం డీసీసీబీ అధికారులు బిచ్యా భూమిని స్వాధీనం చేసుకుని జెండా పాతారు. ఈ సందర్భంగా బ్రాంచి మేనేజర్ సంతోషిమాతా మాట్లాడుతూ బిచ్యా బ్యాంకులో రుణం తీసుకుని వాయిదాలు చెల్లించలేదన్నారు. దీనిపై నోటీసులు పంపినా స్పందించకపోవడంతో భూమిని స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు.



జడ్జిలు, కలెక్టర్‌తో మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి శ్రీదేవి

## పాలమూరులో డిజిటలైజేషన్ ఆఫ్ రికార్డు సెంటర్

**ప్రారంభించిన హైకోర్టు న్యాయమూర్తి శ్రీదేవి**

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మార్చి 29 : మహబూబ్‌నగర్ జిల్లా కోర్టులో డిజిటలైజేషన్ ఆఫ్ రికార్డ్ సెంటర్‌ను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జువ్వాడి శ్రీదేవి శనివారం ప్రారంభించారు. అనంతరం న్యాయమూర్తులతో సమావేశం నిర్వహించారు. జస్టిస్ పర్యటన నేపథ్యంలో మహబూబ్‌నగర్ అర్అండ్‌బీ అతిథిగృహం వద్ద జిల్లా జడ్జి పాపిరెడ్డి, అదనపు జడ్జి కల్యాణ్‌చక్రవర్తి, కలెక్టర్ విజయేందిరబోయి, ఎస్పీ జానకి, అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ స్వాగతం పలికారు.

## యూట్యూబర్ శంకర్‌కు 14 రోజుల రిమాండ్

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, మార్చి 29 (నమస్తే తెలంగాణ): లైంగిక దాడి కేసులో యూట్యూబర్ చలమల్ల శంకర్‌గౌడ్‌ను 14 రోజులపాటు జ్యుడీషియల్ కస్టడీకి తరలిస్తూ 14వ అదనపు చీఫ్ మెజిస్ట్రేట్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. అంబర్‌పేటకు చెందిన మహిళపై లైంగికదాడి చేసినట్టు పోలీసులు కేసు డైరీలో పేర్కొన్నారు. పెళ్లికి నిరాకరించడంతోపాటు, బెదిరించినట్టు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి.. కోర్టు ఎదుట హాజరుపర్చగా కోర్టు రిమాండ్ విధించినట్టు తెలిపారు. నిందితుడిని చంచల్‌గూడ జైలుకు తరలించారు.

## లైసెన్స్ రెన్యువల్‌కు 60 వేల లంచం

**ఏసీబీకి పట్టుబడ్డ ఏఎంసీ కార్యదర్శి**

కరీంనగర్, మార్చి 29 (నమస్తే తెలంగాణ) : కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంపై శనివారం ఏసీబీ దాడి జరిగింది. ఓ పండ్ల వ్యాపారి నుంచి రూ.60 వేలు లంచం తీసుకుంటున్న మార్కెట్ కమిటీ సెలెక్షన్ గ్రేడ్ కార్యదర్శి పురుషోత్తం, సహకరించిన సెక్యూరిటీగార్డ్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కరీంనగర్ పండ్ల మార్కెట్‌లో లైసెన్స్‌ల రెన్యువల్ కోసం 16 మంది వ్యాపారులు కలవగా పురుషోత్తం ఒక్కొక్కరి నుంచి రూ.2లక్షలు లంచం డిమాండ్ చేశారు. రూ.60 వేలకు ఒప్పందం చేసుకున్నారు. వ్యాపారులు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. శనివారం నిమ్మకాయల పాషా రూ.60 వేలు సెక్యూరిటీ గార్డు శ్రీనివాస్‌రెడ్డికి అందజేస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. కార్యదర్శి పురుషోత్తం ఆదేశాల మేరకు తీసుకున్నట్టు తేలడంతో ఇద్దరిని అరెస్ట్ చేసి ఏసీబీ కోర్టులో హాజరు పర్చనున్నట్టు ఏసీబీ డీఎస్పీ వీవీ రమణమూర్తి తెలిపారు.

# ‘పది’ జవాబుపత్రాల తరలింపులో నిర్లక్ష్యం

- **ప్యాకింగ్ చినిగిపోయి బయటపడ్డ బండిల్స్**
- **ఖమ్మం జిల్లా కారేపల్లిలో వెలుగు చూసిన ఘటన**

ఖమ్మం అర్బన్, మార్చి 29 : పదో తరగతి వార్షిక పరీక్షలు రాస్తున్న విద్యార్థుల జీవితాలతో విద్యాశాఖ అధికారులు ఆటలాడుకుంటున్నారు. ఎంతో పకడ్బందీగా తరలించాల్సిన జవాబు పత్రాలను పోస్టాఫీస్ నుంచి తరలించే సమయంలో ప్యాకింగ్ చినిగిపోయి సమాధాన పత్రాలు బయటకు కనిపిస్తున్నా ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోకుండానే తరలించడం వివాదాస్పదంగా మారింది. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రానికి సంబంధించిన సమాధాన పత్రాలు జిల్లా కేంద్రానికి తరలించే సమయంలో శుక్రవారం చోటు చేసుకున్న ఈ ఘటన అధికారుల బాధ్యతా రాహిత్యానికి అద్దం పడుతున్నది. ఈ విషయమై ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ శనివారం డీఈవో, ఆర్డీవోలను విచారణకు ఆదేశించారు. ఇద్దరు అధికారులు సమాధాన పత్రాలను నిల్వ చేసిన ఖమ్మం రైల్వే స్టేషన్‌లోని ఆర్ఎంఎస్ పాయింట్‌కి వెళ్లి పత్రాలను పరిశీలించారు. ప్యాకింగ్ తొలగినా సమాధాన పత్రాలు సురక్షితంగానే ఉన్నాయని కలెక్టర్‌కు నివేదిక అందించారు. మళ్లీ పోస్టల్ అధికారుల చేత భద్రంగా ప్యాకింగ్ చేయించారు.



పదో తరగతి జవాబు పత్రాలకు రక్షణగా వేసిన ప్యాకింగ్ తొలగిపోయి బయటకు కనిపిస్తున్న పేపర్లు